ఉత్తమ సిబ్బందికి ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కృష్ణమూర్తి

చైతన్యపురి: ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్‌–2 డిపోలో జరిగిన కార్యక్రమంలో అత్యధికంగా ఆదాయం తీసుకొచ్చిన కండక్టర్లు, డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బందిని డిపో మేనేజర్ కృష్ణమూర్తి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంటీ వి.ఉషశ్రీ, ఎంఎఫ్ సతీష్‌కుమార్, డిపో సిబ్బంది కె.రమాదేవి, ఉమాపతి పాల్గొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి


చెత్త రిక్షాను పరిశీలిస్తున్న జెడ్సీ

ఎల్‌బీనగర్: తొలగించిన చెత్త పాయింట్ల వద్ద చెత్తను వేస్తే చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ హెచ్చరించారు. హయత్‌నగర్, ఎల్‌బీనగర్ సర్కిళ్ల పరిధిలోని పలు చెత్త పాయింట్లను శనివారం ఆయన డీసీలు, అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీ సేవా ఇస్లావత్, ఏఎంహెచ్ఓ నాగేష్ నాయక్ పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న లక్ష్మిలావణ్య

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌పై జడ్జెస్‌కాలనీ కమ్యూనిటీహాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.లక్ష్మిలావణ్య కాలనీవాసులు సందేహాలను నివృత్తి చేస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం గంగాధర్, పీఆర్ఓ యాదగిరి, కాలనీవాసులు చంద్రారెడ్డి, జనార్ధన్‌రావు, దామోదర్‌గౌడ్, చంద్రకాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వీరాచారి, యాదగిరేందర్, అనంత రెడ్డి పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాదారులు నిబంధనలు పాటించాలి


సారెడ్డి అంజిరెడ్డి

మలక్‌పేట: బాణాసంచా దుకాణాదారులు నిబంధనలు పాటించాలని మలక్‌పేట ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి ఆఫీసర్ సారెడ్డి అంజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాత్కాలిక దుకాణాలు షీట్స్(రేకులు)తో మాత్రమే షెడ్లు ఏర్పాటు చేయాలని, తడకలు, బట్టలు వాడరాదన్నారు. ఎక్కువగా కరెంట్ తీగలు వాడొద్దన్నారు. ప్రతీ దుకాణం వద్ద ఇసుక, నీళ్లు, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఒక్కొక్క దుకాణానికి రెండు వైపులా 3 మీటర్లు, వెనుక, ముందు భాగంలో 6 మీటర్ల దూరం ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదం సంభవిస్తే టోల్ ఫ్రీ 101, లేదా 87126 99414, 040–2344 9213 నంబర్‌లలో సమాచారం ఇవ్వాలన్నారు.

హాష్ ఆయిల్ విక్రేతల అరెస్ట్

మలక్‌పేట: హాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్న ఇద్దరిని మలక్‌పేట ఎక్సైజ్, ప్రొహిబిషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ గోపాల్ వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన మాణిక్యప్ప, అంబర్‌పేటకు చెందిన దుర్గా ప్రసాద్ హాష్ ఆయిల్ విక్రయిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు సలీంనగర్‌లో అదుపులో తీసుకుని 180 గ్రాముల ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. వీరు అరకు, వైజాగ్ ప్రాంతాల్లో హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

నాగోలు: ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలపై వచ్చే 11న ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. న్యూ నాగోలు కాలనీలో ఎస్.ఏ డాంగే భవన్‌లో శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల సమితి కౌన్సిల్ సమావేశంలో మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా ప్రాంతంలో వేల సంఖ్యలో హమాలీ, ఆటోరంగం, భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్లు ఉన్నారని వారి సమస్యలన్నీ పరిష్కరించే విధంగా ఏఐటీయూసీ నాయకత్వం చురుకుగా కార్యక్రమాలు నిర్వహించి నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామస్వామి, శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, చందు యాదవ్, నరసింహా, రాములుగౌడ్, మదిలేటి, సక్రు నాయక్, సత్యనారాయణ, గోపాల్ పాల్గొన్నారు.

జైల్ అదాలత్‌లో 84 కేసుల పరిష్కారం

చంచల్‌గూడ: చంచల్‌గూడ పురుషుల జైల్లో శనివారం నిర్వహించిన జైల్ అదాలత్‌లో 84 కేసులు పరిష్కారమైనట్లు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జైల్ అదాలత్ జరిగింది. హైదరాబాద్ జిల్లాలోని వివిధ కోర్టుల జడ్జిలు అజేష్‌కుమార్, కుమార స్వామి, స్వర్ణలత, సంతోష్‌కుమార్, కవిత, శ్రీలత, మహ్మద్ గౌస్, ప్రశాంతి, దేవీ మనస, సంకేష్ మిత్ర, రాజేందర్ర నాయక్ కేసులను పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న 95 కేసులు అదాలత్‌లో ప్రవేశపెట్టగా 84 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు నిరంజన్ రెడ్డి, దేవ్లా, జైలర్లు జలంధర్, దేవ్‌సింగ్, అచ్చయ్య, తిరుమల్‌రెడ్డి, మధు, రామకృష్ణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిమాన్వితం..
వీరన్నగుట్ట క్షేత్రం

● భక్తుల కోర్కెలు తీర్చే రామలింగేశ్వర స్వామి ● పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి


వీరన్నగుట్టపై భద్రకాళి రామలింగేశ్వరస్వామి దేవాలయం

పవిత్రమైన వీరన్నగుట్టపై భద్రకాళి రామలింగేశ్వరస్వామి స్వయంభుగా వెలిసినట్లు చరిత్ర చెబుతుంది. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి స్వాతి రెసిడెన్సీకాలనీలో వీరన్నగుట్ట క్షేత్రం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది. హయత్‌నగర్ సర్వే నెంబర్ 195లో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్ట ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయి. విజయవాడ జాతీయ రహదారి హయత్‌నగర్ నుంచి రెండు కిలో మీటర్లు లోపలికి వెళ్తే ఆహ్లాదకరమైన వాతావరణంలో వీరన్నగుట్ట క్షేత్రానికి చేరుకోవచ్చు.

మన్సూరాబాద్


ఆలయంలో వెలిసిన రామలింగేశ్వరస్వామి

ఆలయ చరిత్ర

వందల సంవత్సరాల క్రితమే ఇక్కడ రామలింగేశ్వరుడు స్వయంభుగా వెలిసి ఉన్నాడు. గతంలో ఈ ప్రాంతం దట్టమైన అటవీప్రాంతం కావటంతో ఇక్కడికి ఎవరూ వచ్చేవారు కాదు. ఋషులు, మునులు, సిద్ధులు తపస్సు చేసుకునేందుకు అనువుగా ఉండేదని చరిత్ర చెబుతోంది. 1960లో శ్రీకృష్ణ యోగీశ్వరులు, శ్రీబరి మాత, జ్యోతి మహరాజ్, ఉపాసీబాబా తదితరులు ఈ గుహ వద్ద సమావేశాలు ఏర్పాటు చేసుకుని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిద్ధులకు యోగా సాధన నియమాలను బోధించేవారు. కాలక్రమేణ మార్పులు జరుగుతూ వీరన్నగుట్ట ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుంది.

విశిష్టత

పురాతన కాలం నుంచి భక్తుల కోరికలను నెరవేర్చే మహా శివుడికి ప్రతి కార్తీక పౌర్ణమి రోజు సూర్యోదయంన వచ్చే కిరణాలు శివలింగాన్ని తాకి విరాజిల్లుతున్న క్షేత్రంగా ప్రసిద్ధి కెక్కింది. సూర్యుడి సూర్యకిరణాలు శివలింగాన్ని అభిషేకం చేస్తున్నట్లు ప్రకాశిస్తాయి. ఈ గుహ వద్ద ఉన్న తొమ్మిడి గుండ్ల మధ్యలో ఎక్కడో చిన్న రంధ్రం ఉందని, ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యకిరణాలు ఆ రంధ్రం గుండా ప్రసరించి శివలింగాన్ని తాకుతూ అభిషేకం చేస్తున్నట్లుగా ప్రసరిస్తాయి. ఆ సమయంలో శివలింగం దేదీప్యమానంగా వెలుగుతూ నాగమణిల ప్రకాశిస్తుంది.


వీరన్నగుట్ట పర్యాటక ప్రాంత నమూనా

సుందరీకరణకు రూ.10 కోట్లు..

వీరన్నగుట్టపై ఉన్న శివాలయం నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల సరసన చేరనుంది. సుమారు 6 ఎకరాల స్థలంలో దివ్యక్షేత్రం, అలాగే రాక్ గార్డెన్స్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. భౌగోళికంగా ఎతైన ప్రాంతం, స్వయంభు శివాలయం కావటంతో భవిష్యత్‌లో భక్తుల సంఖ్య పెరిగి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది. మొదటి దశగా సుందరీకరణకు రూ.10 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

సుందరీకరణ చేయడమే లక్ష్యం..



వీరన్నగుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా. ప్రతి శివరాత్రికి లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకునే విధంగా అభివృద్ధి చేస్తా. భక్తులకు ఇబ్బందులు లేకుండా విశాలమైన పార్కింగ్, కొండపైకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం, మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేస్తాం. కొండపై కోనేరును ఏర్పాటు చేసి, సుందరీకరణ చేయటమే లక్ష్యం.
– దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి , ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికి
వినతులు


జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధి వివిధ కాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంతంలోని సత్యనగర్, జనప్రియ అపార్ట్‌మెంట్ మూసీ బాధితుల సమస్యలను వివరించారు, అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన స్థలమంతా పట్టా భూములని వాటికి హెచ్‌ఎండీఏ అనుమతులు కూడా ఉన్నాయని హైడ్రా చర్యలు వెనక్కి తీసుకునేలా చొరవ తీసుకోవాలని వినతిలో కోరారు. డివిజన్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణం కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు చేయించాలని కోరారు.

● నాగోలు డివిజన్ పరిధిలో వేధిస్తున్న సమస్యలపై శనివారం నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బండ్లగూడ పెట్రోల్ బంక్ నుంచి ఆనంద్ నగర్ తాజ్ హోటల్ వరకు వేస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం డివిజన్‌లో నూతన సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

నిధులు కేటాయించాలని..

మన్సూరాబాద్: డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రూ.3.19 కోట్లతో సీసీ రోడ్ల పనులు మంజూరు చేయటం జరిగిందని, ఆ పనులన్నీ టెండర్ ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. మరో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించడం జరిగిందని, ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయాలని వినతిలో కోరారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి ప్రతి ఏటా సుమారు రూ.500 కోట్లు పన్నుల రూపంలో జీహెచ్‌ఎంసీకి ఆదాయం వస్తుందని, అదే తరహా ఎల్‌బీనగర్ ప్రాంతానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

జీఎస్ఐ ఉద్యోగులకు సన్మానం


జీఎస్ఐటీఐ ఉద్యోగులను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి

మన్సూరాబాద్: ఐజీఓటీ కర్మయోగి ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లో శిక్షణ పొందిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ) ఉద్యోగులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులందరిలో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు డిజిటల్ ఇండియాలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జీఎస్ఐటీఐ నుంచి అత్యధికంగా ఉద్యోగులు ఆన్‌లైన్ శిక్షణ తరగతులను చేపట్టి ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రశంసాలు పొందారు. జీఎస్ఐటీఐ నుంచి 8 మంది ఉద్యోగులు తమ విధులను యధావిధిగా నిర్వహిస్తూ మొబైల్ పోర్టల్‌లో తీరిక సమయంలో శిక్షణ తరగతులకు హాజరయ్యారు.

అవసరమైన ప్రాంతాల్లో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: వరద నీటి ముంపు సమస్య పరిష్కారానికి అవసరమైన చోట బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేయటం జరుగుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ వీవీ నగర్ కాలనీ పరిసర ప్రాంత ప్రజలు శనివారం ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయం కలిశారు. గతంలో రెడ్డి బ్రదర్స్ గల్లి నుంచి వివేకానందనగర్ వరకు 1200 ఎంఎం డయా ట్రంక్‌లైన్ నిర్మించటం జరిగిందని, ఆ స్థానంలో నూతన బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారని సరూర్‌నగర్ చెరువు నుంచి వచ్చే వరద నీరు పోవడానికి నూతన బాక్స్ డ్రెయిన్ నిర్మాణం మరో చోటుకు తరలిస్తే ఆ కాలనీ వారికి ప్రయోజనంగా ఉంటుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డివిజన్‌లోని సరూర్‌నగర్ లోతట్టు ప్రాంత ముంపునకు గురి కాకుండా పక్కా ప్రణాళికతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, నాయకులు రమేష్ ముదిరాజ్, రమణారెడ్డి, యాదశంకర్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్, ఏఎంహెచ్ఓ


స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొన్న అరుణరవీందర్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ అనురాధ

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ శానిటేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం మూసారంబాగ్ డివిజన్‌లో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సలీంనగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మటికుప్పలు, వ్యర్థాలను తొలగించారు. స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, సర్కిల్–6 ఏఎంహెచ్ఓ అనురాధ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ప్రకాశ్, దినేష్, శానిటేషన్ జవాన్ రమేష్ ఉన్నారు.

సైదాబాద్‌లో..

సైదాబాద్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా భావించాలని కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆమె మలక్‌పేట సర్కిల్–6 ఏఎంహెచ్ఓ అనురాధతో కలిసి సైదాబాద్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. కాలనీలు, బస్తీలలో పలుచోట్ల పేరుకుపోయిన చెత్తను సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెత్తను ఇష్టానుసారంగా పారబోయకుండా ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకే ఇవ్వాలన్నారు. కాలనీలు, బస్తీలవాసులు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది నర్సింగ్‌రావు, చంద్రప్రసాద్, మహేందర్ పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి


ఆకునూరి మురళికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మలక్‌పేట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ నాయకులు శనివారం రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఏడేళ్లుగా మెస్ ఛార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడాలి


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

నాగోలు: బండ్లగూడలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీని కూల్చివేసిన విషయంపై అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని బండ్లగూడ ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు శనివారం నాగోలు కార్పొరేటర్ చింతల అరుణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండ్లగూడలోని పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని రక్షించి విద్యార్థులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కబ్జాచేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

సదర్ వేడుకలకు ఆహ్వానం



సైదాబాద్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సైదాబాద్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించే సదర్ వేడుకలకు రావాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్, మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి ఆహ్వానించారు. సైదాబాద్‌లో ఎంతో కాలంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ మేళా ఉత్సవాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో బత్తుల మహేందర్ యాదవ్, బాలమల్లేష్ యాదవ్, శ్రీహరి యాదవ్, రాజేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

నాగోలు: ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీలో హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను సందర్శించి వైద్య పరీక్షలు చేసుకుని వైద్యుల సలహాలు సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

సదనం బాలలు.. సత్తా చాటారు


స్వర్ణం సాధించిన రూబెన్

సైదాబాద్: సైదాబాద్‌లోని ప్రభుత్వ సదనంకు చెందిన బాలలు జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించారని జువైనల్ వెల్ఫేర్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీబేగ్ తెలిపారు. బాలల సదనంలో ఉంటూ ఇక్కడి ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్న రూబెన్ శనివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా విలువిద్య ఛాంపియన్‌షిప్ అండర్–19 పోటీల్లో మొదటి స్థానం, మరో బాలుడు అశోక్ హకీంపేటలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా ఛాంపియన్‌షిప్ అండర్–19 పోటీల్లో ప్రతిభ చాటి ఇరువురు స్వర్ణం సాధించారన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన వీరు ఈ నెల 28, 29 తేదీల్లో కరీంనగర్‌లో తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

హుండీ పగులగొట్టి చోరీ


హుండీని పరిశీలిస్తున్న ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: దేవాలయంలోని హుండీని పగలగొట్టి నగదును దోచుకెళ్లిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని ఉమా నాగలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 8 గంటలకు ఆలయానికి సూపర్‌వైజర్ లింగయ్య తాళం వేసి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా హుండీ కనిపించలేదు. దేవాలయం ప్రహరీ వెనుక హుండీ తాళం పగులగొట్టి పడిఉంది. హుండీలో సుమారు రూ. 30 వేల నగదు ఉండొచ్చని లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు దేవాలయ గోడ దూకి హుండీ చోరీ చేశారని పోలీసులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఎస్ఐ నరేందర్ దేవాలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.